వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com


# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 212 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|



## ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ


- ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం
- జన్మతః పౌరసత్వం రద్దును అడ్డుకున్న కోర్టు

వాషింగ్టన్,
అమెరికా అధ్యక్షుడిగా ఇటీవలే ప్రమాణం స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి తొలిదెబ్బ తగిలింది. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా వచ్చే పౌరసత్వ హక్కును ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికాలో సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం -మిగతా 3 లో




## తెలంగాణకు 20 లక్షల ఇండ్లు

# మంజూరు చేయండి



### తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళిక

- మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించాం
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వండి
- కేంద్రమంత్రి ఖట్టర్‌తో సమీక్షలో సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్,
ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో ఎనిమిది శాతం ప్రజలు తెలంగాణలో -మిగతా 3 లో



## తెలంగాణ లో ముగిసిన గ్రామ సభలు

- నాలుగు పథకాల ప్రారంభానికి సిద్ధం
- రైతుభరోసాకు నిధులు సమికరణ

హైదరాబాద్,
రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 16,348 గ్రామ/వార్డు సభలు పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గత నాలుగు రోజులుగా జరిగిన గ్రామ/ వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించి తమ దరఖాస్తులు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు -మిగతా 3 లో



## దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం

- తెలంగాణకు అదనంగా ఇవ్వడానికి సిద్ధం
- కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ వెల్లడి
- అభివృద్ధి తప్ప రాజకీయం లేదన్న బండి

కరీంనగర్,
ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి ఇండ్లను నిర్మించబోతున్నట్లు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ అన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. కరీంనగర్ డంప్ యార్డ్‌ను -మిగతా 3 లో



## బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు

- హల్వా వేడుకల్లో పాల్గొన్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,
ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బ్జడెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను నార్త్ బ్లాక్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. -మిగతా 3 లో

## పదేళ్లలో బీఆర్ఎస్

# చేసిందేమి లేదు

- అప్పులకుప్పకు వడ్డీలు కట్టలేక పోతున్నాం
- దావోస్‌లో తెలంగాణకు భారీగా పెట్టుబడులు
- పటాన్‌చెరు కాంగ్రెస్ వ్యవహారంపై విచారణ
- మిడియా సమావేశంలో పిసీసీ చీఫ్ మహేశ్ కుమార్





హైదరాబాద్,
భారాస గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. భారాస ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులూ పెద్దగా ఏమీ లేవని చెప్పారు. ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన -మిగతా 3 లో



## మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలా ?

- గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు
- బాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నారా
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,
మెగా కృష్ణారెడ్డి కంపెనీతో ఒప్పందానికి దావోస్ వెళ్ళాలా... అంటూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ -మిగతా 3 లో

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

- కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- సిరిసిల్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కేటీఆర్

రాజన్న సిరిసిల్ల,
కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మళ్లీ ఎన్నికలు రాగానే ప్రజలు తగిన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే, సిఎంగా కెసిఆర్ ఉంటారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల -మిగతా 3 లో



# ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్


-మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి
-భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం



**ప్రయాగ్‌రాజ్,**
144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ముఖ్యంగా బారత్ లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అమెరికా, యూకే వంటి దేశాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. దీంతో భారత్ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా మారుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దేశంలోని మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు యేటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల నుంచి దేశంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాకు తరలి వస్తున్న పర్యాటకుల్లో 21.4 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ప్రముఖ వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫాం అట్లీస్ నివేదికల ప్రకారం.. దాదాపు 48 శాతం ఆధ్యాత్మిక ప్రయాణ వీసా అప్లికేషన్లు మహా కుంభ్ వంటి పెద్ద ఈవెంట్‌లు, తీర్థయాత్రలకు లింక్ చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా.. ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. 42 మిలియన్ల మంది యాత్రికులు కుంభ్ మేళాకు వస్తారని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం దేశీయ, అంతర్జాతీయ సందర్శకులకు, భక్తులకు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో జా, జఐ వంటి దేశాల నుంచి కూడా ఆధ్యాత్మిక పర్యాటకుల సంఖ్య కూడా ఎన్నో రెట్లు పెరిగింది. వీరిలో మంది ప్రామాణికమైన, జీవితాన్ని మార్చే అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు. సహస్రాబ్ది ఆధ్యాత్మిక యాత్రికులలో 66? మంది మహిళలు ఈ మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయ పర్యాటక కార్యకలాపాల కంటే ఆధ్యాత్మిక, అర్ధవంతమైన ఈవెంట్ల కోసం ఎక్కువ మంది యువత సెలవులను కేటాయిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో కనిపించిన ఈ కొత్త ట్రెండ్.. గ్రూప్ ట్రావెల్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. సమూహ ఆధ్యాత్మిక అనుభవాల కోసం ఇన్‌బౌండ్ ప్రయాణం కోసం ఏకంగా అప్లికేషన్లు 35 శాతం పెరిగాయట. గ్రూప్ టూరిజంలో భాగంగా పర్యాటకులు పవిత్ర ప్రదేశాలను సందర్శించినప్పుడు.. అక్కడి ఆచారాలలో పాల్గొనేందుకు అసక్తి చూసుతున్నారు. ముఖ్యంగా భారత్ ఆధ్యాత్మిక పర్యాటకం గత కొన్నేళ్లుగా బాగా పుంజుకుంది. వారణాసి, రిషికేశ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు ఈ జాబితాలో ముందున్నాయి. ఇక్కడకు ప్రతి యేట మిలియన్ల మంది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. గంగానది పక్కన ధ్యానం చేయడానికి, సాయంత్రం హారతి చూడటానికి అమితాసక్తి కనబరుస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధికి అధికారులు కూడా తీర్థయాత్రల చుట్టూ ఉన్న మౌలిక సదుపాయాలు, వసతిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆధ్యాత్మిక అన్వేషకులను స్వాగతించడానికి, మరిన్ని అనుభూతులను అందించడానికి భారత ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. మహా కుంభ్ వంటి అరుదైన కార్యక్రమాలకు రికార్డు స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడం, దాని ఆధ్యాత్మిక వారసత్వంపై పెరుగుతున్న ప్రపంచ ఆసక్తి వల్ల.. భారత్ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుంది.

## లోన్‌యాప్‌ల వలలో యువత పడవద్దు

అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు




**హైదరాబాద్,**
లోన్ యాప్‌ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు(సూచించారు. లోన్ యాప్‌లో రుణాలు తీసుకొని వారి నుంచి వచ్చే వత్తిడితో డబ్బులు తిరిగి చెల్లించే పరిస్థితి లేక ఆత్మహత్య చేసుకున్న బాలానగర్ వినాయకనగర్‌కు చెందిన తరుణ్‌రెడ్డి కేసుపై విచారణ చేస్తున్నామని అన్నారు. ఈ ఘటనతో మేల్కొని ప్రజలు లోన్ యాప్‌లను ఆశ్రయించొద్దని హెచ్చరించారు. ప్రస్తుతంలో లెక్కకు మించిన కొన్ని సంస్థలు రుణాలు ఇస్తామని ఫోన్లు చేస్తూ ఆశచూపిస్తున్నారని, వారి ఉచ్చులో చిక్కుకున్నాక డబ్బులు ఇచ్చినట్టే ఇచ్చి పూర్తి డేటాను సంపాదించి రుణం ఇచ్చిన వారికి నరకం చూపిస్తున్నారని వివరించారు. ఫోన్లలో మనకు తెలియకుండా కొన్ని మెస్సేజ్‌లు, యాప్‌లు వస్తున్నాయని, వాటిని ఓపెన్ చేసిన మొత్తం డేటాను హ్యాక్ చేస్తున్నారని తెలిపారు. పిల్లలకు ఆండ్రాయిడ్ ఫోన్లు కొనిస్తే తప్పులేదు.. కానీ వారు ఏం చేస్తున్నారు.. ఫోన్‌లో ఏం చూస్తున్నారు.. సోషల్ మీడియాలో వచ్చే పోస్టింగ్‌లు, యాప్‌లపై తల్లీ తండ్రులు నిఘా పెట్టాలన్నారు. యాప్‌ల ద్వార డబ్బు పోయి న, హాకర్ల నుంచి లోన్ యాప్ నిర్వాహకుల నుంచి ఒత్తిళ్లు బెదిరింపులు వస్తే వెంటనే తమను ఆశ్రయించాలని సూచించారు.


## మంత్రి ఉత్తమ్‌కుమార్ కాన్వాయ్‌కు ప్రమాదం




**హైదరాబాద్,**
తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ కాన్వాయ్‌కు శుక్రవారం ప్రమాదం జరిగింది. హుజూర్‌నగర్ నుంచి జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవాలకు వెళ్తుండగా.. సూర్యాపేట మండల కేంద్రమైన గరిడేపల్లిలో కాన్వాయ్‌ని ఒక్కసారిగా ఆపడంతో వెనక నుంచి వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. 8 కార్ల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. మంత్రి ఉత్తమ్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో భద్రతా సిబ్బంది, నేతలు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొంతసేపు ఆందోళన నెలకొంది.

## అమెరికా స్కూలులో కాల్పులు..

-విద్యార్థినిని కాల్చి చంపి తను కూడా



**వాషింగ్టన్**
అమెరికాలోని ఓ స్కూలులో టీనేజర్ కాల్పులు జరిపాడు. గన్ తో స్కూలుకు వచ్చిన విద్యార్థి నేరుగా క్యాంటీన్ కు వెళ్లి ఓ విద్యార్థినిని కాల్చి చంపాడు. ఆపై తనను తాను కాల్చుకుని చనిపోయాడు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నాష్ విల్ లోని అంటియోక్ హైస్కూలులో చోటుచేసుకుందీ దారుణం. దీనిపై మెట్రో పోలీసు అధికార ప్రతినిధి డాన్ ఆరోన్ మీడియాతో మాట్లాడుతూ.. అంటియోక్ హైస్కూలులో ఓ విద్యార్థి (17) గన్ తో కాల్పులు జరిపాడని చెప్పారు. స్కూలు క్యాంటీన్ లో చోటుచేసుకున్న ఈ ఘటనలో జోస్లిన్ కొరియా ఎస్కలాంటే అనే పదహారేళ్ల విద్యార్థిని మరణించిందన్నారు. ఆపై నిందితుడు కూడా అదే గన్ తో కాల్చుకుని చనిపోయాడని వివరించారు. ఈ కాల్పులకు కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. నిందితుడు జోస్లిన్ ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాడా? లేదా? అనేది విచారణలో తేలుతుందని అన్నారు. కాల్పుల ఘటనలో మరో విద్యార్థికి బుల్లెట్ గాయాలయ్యాయని, బాధితుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

# పసిడి ధరలు మరింత పైపైకి

-83వేలు దాటిన పదిగ్రాముల బంగారం ధర



న్యూఢిల్లీ, బంగారం ధర మరోమారు అందనంతంగా అమాంతంగా మరింత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దీనికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల పసిడి ధర రూ.83 వేలు దాటింది. ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.200 పెరిగి రూ.83,100కి చేరుకున్నట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.200 పెరిగి రూ.82,700కి చేరినట్లు అసోసియేషన్ పేర్కొంది. అటు వెండి సైతం కిలోకు రూ.500 మేర పెరిగింది. క్రితం ట్రేడింగ్‌లో రూ.93,500గా ఉన్న వెండి కిలో తాజాగా రూ.94 వేల మార్కుకు చేరుకుంది. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు 2780 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 31.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో ఎలా వ్యవహరిస్తారనే అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల వేళ ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపేలా వ్యాఖ్యలు చేసిన ట్రంప్.. ఇతర అంశాల్లోనూ మున్ముందు ఎలా వ్యవహరిస్తారనే దానిపైనా ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడిని భావిస్తుండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోందని యాక్సిస్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ అనలిస్ట్ దేవేయ గగలానీ అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టనున్న బ్జడెట్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు మున్ముందు బులియన్ మార్కెట్లో బంగారం ధర గమనాన్ని నిర్దేశిరచనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన అనలిస్ట్ జతిన్ త్రివేది పేర్కొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో దారుణం


యువతి హత్య...పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగులు



**మేడ్చెల్,**
మేడ్చల్ జిల్లాలో దారుణం జరిగింది. 25 ఏళ్ల యువతిని బండరాళ్లతో కొట్టి కిరాతకంగా హత్య చేశారు గుర్తు తెలియని దుండగులు. యువతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు నిందితులు. మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్?లో ఈ ఘటన జరిగింది. స్థానికులు ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతి హత్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు ఎవరు..? ఇక్కడకి ఎలా వచ్చింది..? ఎవరితో వచ్చింది..? అన్న విషయాలపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. అలాగే.. మేడ్చల్ జిల్లాలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలు ఆరా తీస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజధాని హైరదాబాద్?లో చోటు చేసుకుంటున్న వరుస హత్యలు నగరవాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు వారాల క్రితం నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ పుప్పాల్ గూడ అనంత పద్మనాభ స్వామి దేవాలయం గుట్టపై జరిగిన డబుల్ మర్డర్ సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటన మురుకవముందే.. తాజాగా మీర్?పేట్లో ఒళ్లు గగుర్పొడిచే హత్య జరిగింది. అనుమానంతో ఓ మాజీ ఆర్మీ జవాన్ భార్యను అత్యంత కిరాతకంగా హతమార్చాడు. చంపిన అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలు చేసి ప్రెజర్ కుక్కర్ లో ఉడకబెట్టాడు. అనంతరం ఆ శరీర భాగాలను ఎండబెట్టి పొడిగా మార్చి దగ్గర్లోని చెరువులో పడేశాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుండగానే.. తాజాగా మేడ్చల్?లో యువతి దారుణ హత్యకు గురి కావడం గమనార్హం.

## గోమతి నదీ కాలుష్యాన్ని మరచిపోతే ఎలా

సిఎం యోగిపై సమాజ్‌వాది నేత మండిపాటు



**లక్నో,**
యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై సమాజ్ వాది పార్టీ విరుచుకుపడింది. లక్నోలోని గోమతి నదిలో కాలుష్యాన్ని ఎత్తిచూపుతూ యమునా నది పరిశుభ్రతపై ఆప్ కన్వీనర్ కేజీవ్రాల్‌పై యోగి చేసిన విమర్శలను తిప్పికొట్టింది. బిజెపి కేవలం ప్రశ్నలు మాత్రమే సంధిస్తుందని, సమాధానం ఇవ్వదని ఎస్‌పి నేత ఫక్రుల్ హసన్ చాంద్ ధ్వజమెత్తారు. 2014లో గంగానది సహా దేశంలోని నదులన్నింటినీ ప్రక్షాళన చేస్తామని బిజెపి హామీ ఇచ్చిందని, యుపి ముఖ్యమంత్రి యోగి యమునా నది పరిశుభ్రతపై సంధించిన ప్రశ్నకు బిజెపియే సమాధానమివ్వాలని అన్నారు. ఈవిధంగా బిజెపి హామీలను వారే నిలదీస్తున్నారని అన్నారు. మురికి కాలువల డంప్‌తో లక్నోలోని గోమతి నది అపరిశుభ్రతకు సాక్ష్యంగా ఉందని ఎద్దేవా చేశారు. కాన్పూర్, లక్నోల్లోని నదుల్లో చేపలే మనుగడ సాధించలేకపోయాయని దుయ్యబట్టారు.

www.prajaswecha.com ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

(మొదటి తరువాయి)

ఉన్నారని సీఎం తెలిపారు. పీఏంవై (యూ)తోపాటు పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల పనితీరుపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని హోటల్ ఐటీసీ కాకతీయలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తో అర్బన్ అండ్ పవన్ సెక్టర్‌పై జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపర్యటనలో ఉన్న కేంద్రమంత్రి ఖట్టర్ ఉదయం కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ చేరుకుని సిఎంతో సమీక్షించారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్–2 కింద ఆరు కారిడార్లను గుర్తించామని మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కారిడార్ –4: నాగోల్–శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్–5: రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్–6: ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్–7: మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్–8: ఎల్ బీ నగర్–హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్– 9: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం–ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని వివరించారు. మొదటి అయిదు కారిడార్ల (76.4 కిమీ) కోసం డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తెచ్చారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ఎ÷–లాన్‌ను నోటిఫై చేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్‌లో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు

# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం

(మొదటి తరువాయి)

ఎత్తేస్తాం. అందుకు అవసరమైన నిధులన్నీ కేంద్రమే మంజూరు చేస్తుందని అన్నారు. . విద్యుత్ విషయంలోనూ తెలంగాణకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా‘ అని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ శు క్రవారం శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కరీంనగర్‌కు చేరుకున్న ఖట్టర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారు. కరీంనగర్ లో 24 గంటల తాగునీరు, మల్టీ పర్పస్ పార్క్‌ను కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

అనంతరం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగే బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండిసంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తనకు ఎలాంటి విభేధాలు లేవని అన్నారు. గంగుల కమలాకర్‌తోనే కొద్దిగా గ్యాప్ ఉందని త్వరలో అదికూడా సెట్ అయిపోతుందన్నారు. కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తనకు తెలుసన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతున్నామన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్నానన్నారు. కరీంనగర్‌లో నాలుగు వేల ఇండ్లకు నిరంతరాయంగా 24 గంటల పాటు నీళ్లు సరఫరాల అవుతాయన్నారు. పేదరికం నుంచి హర్యానా సీఎంగా, కేంద్రమంత్రిగా ఎదిగిన మనోహర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో గర్వకారణమన్నారు. కరీంనగర్‌లో డంప్ యార్డ్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారని.. డంపింగ్ యార్డు సమస్య నుంచి కరీంనగర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే కొట్లాడి సాధించినట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాదం స్కీంలో చేరుస్తున్నామని తెలిపారు. అలాగే కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్‌లో చేరుస్తామన్నారు. సిరిసిల్ల, వంగర ప్రాంతాల్లో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో తెలంగాణకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, రోడ్ల కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని బండి సంజయ్ వెల్లడించారు.

# పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమి లేదు

(మొదటి తరువాయి)

మాట్లాడారు. ‘దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే పెట్టుబడిదారులకు నమ్మకం కుదిరింది. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొచ్చాయి. మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. ప్రజలను మభ్యపెట్టడం.. ఆచరణ సాధ్యంకాని హామీలివ్వడమే భారాస పని. గత ప్రభుత్వ పాలనతో నెలకు రూ.ఆరున్నర వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. మంచి పనులు జరుగుతున్నప్పుడు ప్రశంసించడం నేర్చుకోండి. తాజాగా రాష్ట్రానికి రానున్న పెట్టుబడులతో 50వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముంది‘ అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఏ పార్టీ వాళ్ళు అని తాము చూడడం లేదని.. పెద్దవాళ్ళకి పథకాలు ఇస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడి పెట్టడానికి అనేక కంపెనీలు వస్తాయని.. అందులో మేఘా కృష్ణారెడ్డి కంపెనీ ఒకటన్నారు. పెట్టబడులపై ఎప్పుడంటే అప్పుడు చర్చకు సిద్ధం అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. సీఎం దావోస్ పర్యటన తెలంగాణకు ధమాకా అన్నారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణలో ఒక చరిత్ర నెలకొందన్నారు. కాంగ్రెస్ ఉంటేనే పెట్టుబడులు వస్తాయని మరోసారి నిరూపితమైందని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులకు కాంగ్రెస్‌పై నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ జవాబుదారీతనంపై పెట్టుబడిదారులకు నమ్మకం ఉందన్నారు. రైజింగ్ 2050 నినాదం గేమ్ చెంజర్‌గా మారిందన్నారు. తనకి తాను సుపర్ స్టార్‌గా చెప్పుకునే కేటీఆర్ పదేండ్లలో ఎన్ని పెట్టుబడులు తెచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో 27 వేల కోట్లు మాత్రమే పెట్టుబడులు తెచ్చారని అన్నారు. కేసీఆర్‌కు విజన్ లేకపోవడం వల్లే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. ఇకపోతే కేసీఆర్ ఫోటోను పెట్టుకుంటా.. నాకు ఇష్టమైతేనే రేవంత్ రెడ్డి ఫోటో పెడతా ‘ అంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. గూడెం మహిపాల్ రెడ్డి మాటలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కొంత సమస్య ఉందని.. కమిటీ వేశామని.. కమిటీ అన్ని విషయాలపై అధ్యయనం చేస్తుందని పీసీసీ చీఫ్ చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్న అంశంపై కూడా కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. పార్టీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఎమ్మెల్యేల ద్వారానే లబ్దిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గంలో పాత కొత్త ఇబ్బందులు ఉన్నాయన్నారు.

## బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు

(మొదటి తరువాయి)

ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి హల్వాను నిర్మలా సీతరామన్ స్వయంగా పంచిపెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఉన్నతాధికారులు తుహిన్‌కాంత్ పాండే, అజయ్ సేథ్ తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా ఎనిమిదోసారి. ఓ వైపు జీడీపీ వృద్ధి మందగించిన వేళ (6.4 శాతం నమోదు కావొచ్చని అంచనా) 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆమె బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. ఈ సారి కూడా డిజిటల్ రూపంలోనే బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు. గడిచిన నాలుగు బడ్జెట్లుగా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది – పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే దాదాపు మరో వారం రోజుల పాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బ్జడెట్లోని ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్–ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

(మొదటి తరువాయి)

ఎంఎల్ఏ కెటిఆర్ అన్నారు. సిరిసిల్లలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్థానిక తెలంగాణ భవన్‌లో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ..పదవీకాలం పూర్తయిన మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. బిఆర్ఎస్‌కు పోయింది అధికారమే కానీ ప్రజల అభిమానం కాదని, మనలోని పోరాట పటిమ దూరం కాలేదని అన్నారు. కాంగ్రెస్‌తో బిఆర్ఎస్‌ను ప్రజలు పోల్చుకుని చూస్తున్నారని, గత పాలనలో ప్రజలు ఒక్కరోజు కూడా కష్టాలు పడలేదన్నారు. కాంగ్రెస్ అబద్ధసే హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజలు కాంగ్రెస్‌పై తిరుగబడుతున్నారని అన్నారు. ప్రజాపాలనలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో కోటి ఆరు లక్షల మంది దగ్గర దరఖాస్తులు తీసుకోగా, వాటిని బుట్టదాఖలు చేసి మళ్లీ దరఖాస్తులు కోరడంతో కేవలం జిరాక్స్ సెంటర్ల వారు మాత్రమే బాగుపడుతున్నారని వ్యాఖ్యానించారు. గ్రామసభల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరు వల్ల ప్రజలు అధికారులపై తిరగపడుతున్నారని, దీనివల్ల అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. గ్రామ సభలకు కాంగ్రెస్ మంత్రులు, శాసనసభ్యులు ఎందుకు హాజరవడం లేదని నిలదీశారు. సోషల్ మీడియాపై కేసులు పెట్టడం, జైళ్లకు పంపడంపై దృష్టి తగ్గించి పాలనపై దృష్టి సారించాలని రేవంత్ సర్కార్‌కు హితవు పలికారు. ప్రభుత్వ ఏడాది పాలనలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పులు తెచ్చారన్నారు.

## ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ

(మొదటి తరువాయి)

తీసుకుంది. ఆ రద్దు ఆదేశాలను న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఆ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ట్రంప్ నిర్ణయం రాజ్యంగ విరుద్ధమని పేర్కొన్నారు. జనవరి 20న యూఎస్ అధ్యక్షుడిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే ట్రంప్ పలు కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. పారిస్ ఒప్పందంతో పాటు డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగడం, ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి నుంచి పని విధానాన్ని రద్దు చేయడం, ప్రభుత్వ నియామకాలపై నిషేధం, క్యాపిటల్ హిల్‌పై దాడిచేసిన వారికి క్షమాభిక్ష పెట్టడం, వలస వచ్చిన వారి పిల్లలకు జన్మతః వచ్చే పౌరసత్వ రద్దు నిర్ణయం ఉన్నాయి. దీంతో ట్రంప్ నిర్ణయంపై డెమెక్రాట్‌ల నేతృత్వంలోని వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఓరేగాన్ రాష్ట్రాలు కోర్టును సియాటిల్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించాయి. అమెరికా రాజ్యాంగం 14వ సవరణ ప్రకారం.. పౌరసత్వ చట్టం నిబంధనలకు ట్రంప్ ఆదేశాలు వ్యతిరేకమని వాదించాయి. అమెరికాలో పుట్టిన ఎవరికైనా పౌరసత్వం లభిస్తుందని న్యాయవాదులు వాదించారు. దీంతో సియాటిల్ డిస్టిక్ట్ జడ్జ్ జాన్ కాఫ్నర్.. జన్మతః పౌరసత్వ రద్దు కార్యనిర్వాహక ఆదేశాలను తాత్కాలికంగా నిలుపుదల వేస్తూ తీర్పు ఇచ్చారు. ఇక పౌరసత్వ రద్దుకు సంబంధించి ఇప్పటికే 22 రాష్ట్రాలు, పలు పౌరసంఘాలు కోర్టుల్లో పలు దావాలు వేశాయి.

## తెలంగాణ లో ముగిసిన గ్రామ సభలు

(మొదటి తరువాయి)

రోజులుగా గ్రామ సభలు 12,861, వార్డు సభలు 3,487 మొత్తం 16,348 నిర్వహించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ గ్రామ సభలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. ఇకపోతే రైతు భరోసా లెక్క తేలింది. రాష్ట్రవ్యాప్తంగా సాగుకు యోగ్యమైన భూములు 1.49 కోట్ల ఎకరాలు ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటికి సీజన్?కు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా ఇచ్చేందుకు మొత్తం రూ.8,900 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఇప్పటికే ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. రైతు భరోసా కోసం ప్రభుత్వం నిధులు రెడీ చేసుకున్నది. ఇప్పటికే రూ.10 వేల కోట్ల మేర సేకరించింది. ఇందులో రైతు భరోసాకు అవసరమైన రూ.8,900 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఏకకాలంలో కాకుండా ఎప్పటిలాగే విడతల వారీగా రైతు భరోసాను ప్రభుత్వం జమ చేయనుంది. ఎకరాకు రూ.6 వేల చొప్పున కోటి 49 లక్షల ఎకరాలకు ఇస్తే రూ.8,900 కోట్లు అవుతున్నది. గతంతో పోలిస్తే ఇది దాదాపు రూ.1,500 కోట్లు ఎక్కువ. ఏయే గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూముల డిజిటల్ బ్లాకింగ్ పూర్తయిందో, ఆ గ్రామాల్లో ఎకరా వరకు భూములున్న రైతులకు ఈ నెల 26న పెట్టుబడి సాయం అందనుంది. ఇలా విడతల వారీగా పూర్తి స్థాయిలో నిధులను 15 రోజుల్లోగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అయితే టీజీబీలో ఏపీజీవీబీ విలీనం నేపథ్యంలో ఆయా బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న రైతులకు పెట్టుబడి సాయం జమ చేస్తే టెక్నికల్?సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఒకవేళ ఈ నెల 25 కల్లా ఆ బ్యాంకు నుంచి క్లారిటీ వస్తే ఆ మరుసటి రోజు యథావిధిగా నిధులు జమ చేస్తామని, లేదంటే ఆ ఖాతాదారులకు తర్వాత జమ చేస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రాళ్లు, రప్పలు, కొండలు, వెంచర్లు, హైవేలు, ఇరిగేషన్, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్న భూముల లెక్క తేల్చారు. ఇలాంటివి 3 లక్షల ఎకరాలకు పైగా ఉన్నట్టు గుర్తించారు. గ్రామ సభలు నిర్వహించి, ఆ భూముల సర్వే నెంబర్లను ఆన్‌లైన్?లో బ్లాక్‌చేస్తున్నారు.

## మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలా ?

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు చురకలంటించారు. జూబ్లీహిల్స్‌లో రోడ్డుకు అటు వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని.. ఇటు వైపు మెగా కృష్ణారెడ్డి ఉంటారని వివరించారు. దావోస్ టూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి దారి ఖర్చులు వృధా చేశారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీష్ రావు విలేకర్లతో మాట్లాడుతూ.. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే.. రేవంత్ సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఏపీని ఆపడం చేతకాకుంటే.. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి.. గురదక్షిణ చెల్లించుకొంటున్నట్లు అనుమానం కలుగుతోందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకు పోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక కారణం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..? బనకచర్ల ఆపాలని ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదు సీఎం రేవంత్ రెడ్డి. నాలుగు ప్రాజెక్టులకు నీళ్ల కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బనకచర్లకు నిధుల కోసం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులుతోంది. చంద్రబాబు నవంబర్‌లో లేఖ రాస్తే సీఎం రేవంత్ ఏం చేశారు..? బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు..? బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు.

## సంపాదకీయం

# నిరంకుశ విధానాలను మొగ్గలోనే తుంచేయాలి !

ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి కనీసం 8 గంటల పని కాలాన్ని సాధించి మేడే జరుపుకుంటున్న వేళ ఇటీవల అందుకు భిన్నంగా కొందరు కార్పోరేట్లు చేస్తున్న వ్యాఖ్యలు దీనిని అవహేళన చేసేలా ఉన్నాయి. అంతెందుకు ఉద్యోగులను పని యంత్రాలుగా భావిస్తున్నారు. నిరంతరం ఊడిగం చేసేలా..ఇల్లూ వాకిలి వదిలేసి పనికే పరిమితం కావాలన్న వీరి నిరంకుశ ఆలోచన విధానాలను ఆదిలోను తుంచేయాలి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగబోతున్న వేళ విపక్షాలు ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలి. పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతల లేకుండా, జీవితంలో ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియ కుండా చేస్తున్నారు. నిజానికి ఈ సమయంలో అయినా ఇక ఉద్యోగాలకు భద్రత కల్పించేలా, పనిగంటలు నిర్దేశించే లా కఠిన చర్యలకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. నిజానికి పనిచేసే ప్రదేశంలో మంచి వాతావరణం ఉంటే చెప్పకుండానే ఉద్యోగులు శ్రమిస్తుంటారు. ఇక అసలు విషయానికి వస్తే....వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గపు వర్గ స్వభావాన్ని బట్టబయలు చేసాయి. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యను ఎంతసేపు తదేకంగా చూస్తూ కూర్చుంటారు? ఆదివారం పూట కూడా పనిచేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నాను' అని అయన అన్నారు. కొన్నాళ్ల క్రితం ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. వారానికి 70గంటలు పనిచేయాలని నారాయణమూర్తి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు సుబ్రమణ్యన్ మరో 20 గంటలు అదనంగా కలిపి 90 గంటలు వారానికి పనిచేసి తీరాలంటున్నారు. అలా చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై కార్మికలోకం సహజంగానే ఆగ్రహిస్తోంది. ఇది పారిశ్రామిక విప్లవం తొలినాళ్లలో కనిపించిన బానిస మనస్తత్వానికి నిదర్శనం. దీనిని ఆదిలోనే అరికట్టాలి. కేంద్రం దీనిపై ఎలాంటి స్పందనా చూపలేదు.అందుకే విపక్షాలు పార్లమెంట్ సమావేశాల్లో దీనిని ప్రస్తావించి , ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారి మనస్తత్వాన్ని ఎండగట్టాలి. అవసరమైతే కార్మిక చట్టాలను బలోపేతం చేసేందుకు పూనుకోవాలి. పనిదినాలు, సెలవులు,కార్మిక చట్టాలు చట్టుబండలు అవుతున్న వేళ వీరు ఇలా రెచ్చిపోతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఉద్యోగులను యంత్రాలుగా చూస్తున్నారు. భారతీయ కార్మికుల రక్త, మాంసాలను దోచుకోవడానికి పోటీ పడుతున్నారన్న భావన కలుగుతోంది. ఇలాంటి వారిని నిగ్గదీయాలి. ఇదే సమయంలో కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఐటి ఉద్యోగులే కాకుండా చిన్నాచితక కంపెనీలు, రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న దినసరి కూలీలు ఇష్టపికే వెట్టి చాకిరీ చేస్తున్నారు. ఇలాంటి వారి గురించి ఆరా తీయాలి. కార్పొరేట్ ప్రపంచంలో కూడా సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. హర్ష్ వర్ధన్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర తదితరులు ఆ వ్యాఖ్యలలోని హేతుబద్ధతను తప్పు పట్టారు. కార్పొరేట్-మతశక్తుల కూటమిగా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లేబర్‌కోడ్‌లను రూపొందిం చింది. ప్రస్తుతమున్న గరిష్ట పనివేళలను మార్చడానికి ఆ కోడ్‌లలో ప్రతిపాదించింది. కార్మిక సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో లేబర్ కోడ్‌లను ఇంకా నోట్గి÷ చేయలేదు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కొన్ని బిజెపి ప్రభుత్వాలు కూడా పనిగంటలు పెంచేందుకు చట్టాలు తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఉత్పత్తిని పెంచడానికి, ఆర్థిక వృద్ధిని సాధించడానికి కార్మికులు ఎక్కువ గంటలు పని చేయాలని కొన్ని కార్పొరేట్ శక్తుల మాదిరిగానే ప్రభుత్వాలు కోరుకుంటుం డటం గమనార్హం. ఇది కార్మికుల రక్తమాంసాలతో కార్పొరేట్లకు లాభాలను వండి, వడ్డించే దుర్మార్గ చర్య! పనిగంటలు పెంచితే కార్మికులు గుండెపోటుతో మరణించే అవకాశం ఉందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక ఈ సందర్భంగా గర్తించాలి. నిజానికి మనిషి పనిచేయడానికి కొన్ని గంటలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తరవాత విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. కొంత ఉల్లాసం కూడా అవసరం. అలా చేయలేకపోతే మనిషి శరీరం పనిచేయదు. మెదడు ఆలోచించదు. మొద్దుబారి పోతుంది. నిజానికి దేశాభివృద్ధికి ఆటకం కలిగిస్తున్న అంశాలేమిటి? ప్రస్తుత సంవత్సరం జిడిపి 6.4 శాతానికి తగ్గుతుందని, నాలుగేళ్లలో ఈ స్థాయి పతనం ఎప్పుడూ లేదని జాతీయ గణాంకాల సంస్థ తెలిపింది. ప్రజల వద్ద కొనేందుకు డబ్బు లేకపోవడంతో దేశీయ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఫలితమిది. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారి వాస్తవ ఆదాయంలోఎటువంటి పెరుగుదల లేదు. దానికి తోడు ద్రవ్యోల్బణం వెంటాడుతోంది. నిరుద్యోగం ఏటికేడాది పెరుగుతూనే ఉంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావాలు మార్కెట్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ వ్యయాన్ని తగ్గిస్తోంది. రైతుల పంటలకు కనీస మద్దతు ధర లభించడంలేదు. ఉపాధిహామీ నిధుల్లోనూ కేంద్రం కోత పెట్టింది. కార్మికులు శ్రమించి అధికోత్పత్తి చేసినా మార్కెట్లలో కొనే నాధుడు లేని పరిస్థితి నెలకొంది. ఈ అస్తవ్యస్థ విధానాలు మారాలి. సరైన విశ్రాంతి, వినోదంతోనే కార్మికలోకం అసాధ్యమైన విజయాలను సైతం సుసాధ్యం చేస్తుందన్న నిజాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఎనిమిది గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న కార్మికవర్గం మళ్లీ అలాంటి పోరాటాలు చేసైనా దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని తాజా ఘటనలు గుర్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. మనుషులను బానిసలుగా భావించే వర్గాలను గుర్తించి చీల్చి చెండాడాలి.

# ప్రపంచ ప్రయాణం 19వ శతాబ్దంలోకి..?

మనుషుల సంతోషాన్ని విస్తృతపరుస్తూ సమాజం ముందుకే వెళుతుందని మనం నమ్ముతాం. మొన్నటికంటే నిన్న మిన్నగా.. నిన్నటి కంటే నేడు ఘనంగా.. నేటి కంటే రేపు మరింత అద్భుతంగా ఉంటుందంటూ రెండుమూడు వందలేళ్లల్లో చాలా రచనలు వచ్చాయి. ఆశలు లేకపోతే అడుగులే పడవు. భవితకు భరోసా కనపడకపోతే మన ప్రయత్నాల్లో ఊపూ ఉత్సాహం ఉండదు. సుదీర్ఘ కాలప్రవాహంలో సమాజం ముందుకు నడవటం నిజం! స్థూలంగా చరిత్ర చెప్పేది ఇదే! కానీ వెనుకంజ లేని సమాజమూ జీవితమూ ఉండవు. ఆ వెనుకంజ ఒక్కోసారి భయం కొల్పుతుంది. గతాన్ని నెత్తిమీదకు తెచ్చిపెడుతుంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. అంతర్జాతీయ వ్యవహారాల వ్యాఖ్యాత, ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్' టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు (ఇంపిరియలిజం) పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. సంతృప్తికరమైన జవాబు మాత్రం రాలేదు. సమాధానాలు రానంత మాత్రాన ప్రశ్నల విలువలు తగ్గిపోవు. చరిత్రలో జవాబులకంటే ప్రశ్నలకే బలం ఎక్కువ. మనిషి అన్వేషణలన్నీ ప్రశ్నలతోనే మొదలయ్యాయి. మహామహా ఆవిష్కారాలన్నీ వాటితోనే సాధ్యమయ్యాయి. వస్తువులను, పరికరాలను సృష్టించుకుని మనుగడ సాగిస్తున్న మనుషులకు ప్రపంచ సృష్టికి కూడా ఎవరో కారణమై ఉంటారనే ప్రశ్న తట్టి.. జవాబుల కోసం సాగించిన చింతనాన్వేషణతోనే మతాలన్నీ ఊపిరులు పోసుకున్నాయి. ఒక పథకంతో, శ్రమతో చేసే వస్తు, పరికర సృష్టే మానవ జీవనసారం కాబట్టి ఈ చరాచర ప్రపంచమూ అటువంటి సృష్టిజనితమేనని మనిషి అనుకున్నాడు. కాబట్టి ప్రశ్నకున్న విశిష్ట పాధాన్యత నుంచి చూస్తే 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలు మళ్లీ విజృంభిస్తున్నాయా? అన్నది సందర్భోచితమైందిగానే తోస్తుంది. లోతుగా పరిశీలిస్తే ఆ ప్రశ్నకు సమాధానం అవుననే కొంతమేరకు చెప్పుకోవాల్సి వస్తుంది. ఆనాటి పోకడలు కొన్ని ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇవి ఎంత బలపడితే అంతగా ప్రపంచం వెనుకడుగులు వేస్తున్నట్లుగా కచ్చితంగా భావించొచ్చు.


19వ శతాబ్దంలో సామ్రాజ్యవాదాన్ని అనుసరించిన



దేశాలన్నీ జాతీయవాదంతోనే తమ ఆక్రమణలను, ఆధిపత్యాన్ని సమర్థించుకున్నాయి. తమ దేశమే అన్ని రంగాల్లోనూ ముందుండాలనే వాదననే ప్రచారాస్త్రంగా చేసుకుని ప్రజలను యుద్ధోన్ముఖంగా నడిపించాయి. మొదటి ప్రపంచయుద్ధం ఆ విధంగానే వచ్చింది. అగ్రస్థానం కోసం అన్ని నియమాలనూ కాలదన్నాయి. వెనుకబడిన దేశాల ప్రజలకు నాగరికతనూ ఆధునికతనూ సాంకేతిక%-%శాస్త్ర విజ్ఞానాన్నీ అందివ్వటానికే ఆక్రమణలూ ఆధిపత్యాలూ యుద్ధాలూ అవసరమని వాదించాయి. సామ్రాజ్యవాదం ప్రత్యక్ష ఆక్రమణ రూపంలోనే ఉండాల్సిన పనిలేదు. కీలుబొమ్మ ప్రభుత్వాలను పెట్టి కీలక నిర్ణయాలన్నీ గుప్పెట్లో పెట్టుకుని సంపదను తరలించుకుపోయే పరోక్ష సామ్రాజ్యవాదమూ ఉంటుంది. రెండిటిలోనూ జరిగేది ఒకటే. ముడిసరుకుల సరఫరా కేంద్రంగా ఆక్రమిత దేశాలను మార్చివేయటం, పారిశ్రామిక ఉత్పత్తులకు కొనుగోలు మార్కెట్లుగా దిగజార్చటం సామ్రాజ్యవాదంలో ప్రధానంగా ఉంటుంది. ఇప్పుడైతే కాలుష్యకారక పరిశ్రమలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. అన్ని వ్యవస్థలనూ సామ్రాజ్యవాదం తన అవసరాలకు అనుగుణంగా మార్చివేస్తుంది. రాజకీయాలు మారిపోతాయి. పండే పంటలు మారిపోతాయి. చేసే ఉత్పత్తులు మారిపోతాయి. భూములపై హక్కులు మారిపోతాయి. పాతవర్గాలు పోతాయి. కొత్త వర్గాలు పుట్టుకొస్తాయి. ఇక రైల్వేలు, పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆధునిక విద్యా సౌకర్యాలు.. శాంతిభద్రతల స్థాపన లాంటివన్నీ సామ్రాజ్యవాద అవసరాల్లో భాగంగా కొంతమేరకు వస్తాయి. సామ్రాజ్యవాదం అహంకారపూరిత జాతీయవాదం చాలా సందర్భాల్లో పెనవేసుకునే ఉంటాయి. అమెరికా అగ్రస్థానంలో ఉండాలని పదేపదే వినిపిస్తున్న వాదనను పరిశీలిస్తే ఆ తరహా జాతీయవాదమే కనపడుతుంది. ఇతర దేశాల పట్ల అనుసరించాల్సిన మర్యాదలను విపరీత జాతీయవాదం పాటించదు. పన్నుల్లో అసంబద్ధత ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవటం ఆధునిక దౌత్యనీతి. ట్రంప్ హెచ్చరికలను చూస్తే ఆ దౌత్యనీతి ఛాయలు ఎక్కడా కనిపించవు. ఇంతపన్ను విధిస్తాం.. అంత పన్ను విధిస్తాం.. అనే ఏకపక్ష ప్రకటనలే మనం వింటున్నాం. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలనీ, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామనీ, పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామనీ చేసే ప్రకటనలు సామ్రాజ్యవాద కాలాన్ని గుర్తుకు తెస్తాయి. దౌత్యపద్ధతులను, ఒప్పందాలను ఖాతరు చేయకపోవటం సామ్రాజ్యవాదంలో ఒక ప్రధాన లక్షణంగా ఉండేది. పరస్పర అంగీకారాల ద్వారా ఏర్పడిన సంస్థలను తప్పుపట్టటం, వాటి నుంచి వైదొలగటం ఆనాటి పోకడల్లో భాగమే. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచీ ప్రపంచ పర్యావరణ ఒప్పందం నుంచీ తప్పుకోవటాన్ని ఇంకోలా అర్థం చేసుకోలేం. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం జరగాలనీ దిగుమతులు%-%ఎగుమతులపై పన్నులు కనీస స్థాయిలో ఉండాలనీ ఆర్థిక సంస్కరణల పేరిట వివిధ దేశాలకు నిర్దేశించిందీ అమెరికా పాలకులే. ఇప్పుడు దానికి భిన్నంగా 19వ శతాబ్దంలో చేసినట్లు అధిక పన్నులను విధించి చౌక ఉత్పత్తులతో తమకు పోటీదారులుగా మారిన దేశాలను కట్టడి చేయాలనీ చూస్తున్నారు. చైనాతో వ్యవహరిస్తున్న తీరే దీనికి నిదర్శనం. పారిశ్రామిక విప్లవం తర్వాత ఇప్పటి ధనిక దేశాలన్నీ ఆనాటి పోటీ దేశాల ఉత్పత్తులపై విపరీతంగా పన్నులు వేసి వినియోగదారులు వాటిని కొనకుండా చేశాయి. భారత%-%చైనా సంప్రదాయ ఉత్పత్తులను అలాగే దెబ్బతీశారు. అధికపన్నుల విధింపులనే 'టారిఫ్ వాల్స్'గా పిలుస్తారు. ట్రంప్ హెచ్చరికలు కూడా ఆ 'వాల్స్' లాంటివే. ట్రంప్ దూకుడు చూస్తుంటే ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి కూడా వైదొలగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు

# రష్యా దిగివస్తుందా?

యుద్ధం ఆపకపోతే మరిన్ని ఆంక్షలతో పీల్చిపిప్పిచేస్తానని అధికారంలోకి వచ్చీరాగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు రష్యా తాపీగా, శాంతంగా ప్రతిస్పందించింది. చర్చలకు తాము సిద్ధమేననీ, కానీ ఆంక్షలకే ట్రంప్ అత్యుత్సాహపడుతూంటారని క్రెమ్లిన్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఒకపక్క పుతిన్‌ను ప్రశంసిస్తూనే, ఆయనతో సాన్నిహిత్యం ఉన్నదని అంటూనే, రష్యాను ఇబ్బందిపెట్టడం తన ఉద్దేశం కాదని చెబుతూనే ట్రంప్ చాలా విమర్శలు చేశారు. దారికొచ్చి సంధికుదర్చుకోనిపక్షంలో వివిధ రకాల పన్నులు, సుంకాలు, ఆంక్షలతో రష్యాను దెబ్బతీస్తానని హెచ్చరించారు. తానేగనుక అధికారంలో ఉండివుండే అసలు ఈ యుద్ధమే మొదలయ్యేది కాదని ట్రంప్ మళ్ళీ గొప్పచెప్పుకున్నారు. పుతిన్ వల్లే రష్యా నాశనం అవుతోందనీ, ఆర్థికంగా పతనమైపోతోందనీ ఒకపక్క శాపాలు పెడుతూనే తామిద్దరి మధ్యా మంచి అవగాహన ఉన్నదని ట్రంప్ చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను బట్టి, ఆయన ఎప్పటినుంచో హామీ ఇస్తున్నట్టుగానే రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధాన్ని సాధ్యమైనంతవేగంగా ముగించే ప్రయత్నమైతే ఆరంభిస్తున్నట్టు కనిపిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం నాలుగో ఏడాదిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, అర్థంపర్థంలేని ఈ యుద్ధాన్ని ఇంకా పొడిగించడానికి వీల్లేదనీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారనీ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివర్లోగా శాంతి తెస్తానంటూ ఆయన తనకు ప్రమాణంచేశారని జెలెన్‌స్కీ కూడా చెబుతున్నారు. మొత్తంగా యుద్ధాన్ని ముగించడానికో, అందుకు వీలుగా చర్చలకో రంగం సిద్ధమవుతున్నట్టు కనబడుతోంది. యుద్ధం పరిష్కారం కాదని నరేంద్రమోదీ వంటివారు ప్రపంచవేదికలమీద ప్రవచిస్తున్నప్పుడల్లా పుతిన్ సైతం సానుకూలంగా స్పందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే, అధికారంలోకి వచ్చిన ఒక్కరోజులోనే యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రకటించిన ట్రంప్‌కు అది అంత సులభం కాదని తెలియకపోదు. యుద్ధంలో



రెండుపక్షాలూ పీకలోతున సుదీర్ఘకాలంగా మునిగి ఉండటం, అపారనష్టాలను మూటగట్టుకోవడం, ఎంతోకొంత కోల్పోనిదే కాలువెనక్కుతీసుకోలేకపోవడం వంటివి పరిష్కారాన్ని జటిలం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయపక్షాలనూ కూడా బుజ్జగింపులు, బెదిరింపులతో దారికి తేక తప్పదు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధ సరఫరాలతోనో, రష్యాను మరిన్ని ఆంక్షలతో శిక్షించడంవల్లనో యుద్ధాన్ని ఆపడం అసాధ్యం. ఉభయపక్షాలకూ ఎంతోకొంత లబ్ధిచేకూర్చి, రాజీపడేట్టుగా చేయడం తప్ప మార్గం లేదు. ఇన్నేళ్ళు యుద్ధం చేసి కూడా తనకు పక్కలోబల్లెంలాగా ఉంటున్న ఉక్రెయిన్‌ను అలాగే వదిలేయడం పుతిన్‌కు ససేమిరా ఇష్టం ఉండదు. ఉక్రెయిన్‌తో ఇకమీదట ఏ సమస్యా రాకుండా, అది నాటోతో కలిసి తన నెత్తినెక్కే అవకాశాలు లేన్నప్పుడే రష్యా దిగివస్తుంది. ట్రంప్ బృందం ప్రతిపాదనలకు ఉక్రెయిన్ సరేనంటే, అది ఐదోవంతు భూభాగాన్ని రష్యాకు వదులుకోవలసి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఆ మేరకు రష్యాను సంతృప్తిపరచి, మిగతా ఉక్రెయిన్‌ను పునర్నిర్మించడానికీ, ఆర్థికంగానూ, ఆయుధపరంగానూ అండగా ఉండటానికీ అమెరికా హామీ పడవచ్చు. గెలిచిన యుద్ధాలతోనే కాదు, నిలిపినవాటితోనూ, నిలువరించినవాటితోనూ తాను విజయాన్ని లెక్కిస్తానని ట్రంప్ చెప్పుకున్నారు. పదిహేను నెలలుగా సాగుతున్న గాజాయుద్ధాన్ని ముగించడానికి చాలాకాలం ప్రయత్నాలు జరిగినమాట నిజం. ట్రంప్ అధికారంలోకి రావడానికి ముందే చర్చలు మొదలైనా, దిగిపోతున్న బైడెన్‌మాటకంటే, మరో నాలుగేళ్ళు అధ్యక్షుడుగా ఉండబోతున్న ట్రంప్ హెచ్చరికలకే నెతన్యాహూ దిగివచ్చారని అంతా నమ్ముతున్నారు. కాల్పుల విరమణతో పడిన ఆ తొలి అడుగు అంతిమశాంతికి దారితీస్తుందని భావిస్తున్నారు. స్వల్పకాలంలోనే ఉక్రెయిన్‌ను గెలవగలనని, అంతిమంగా తనదే పైచేయి అవుతుందని దానితో యుద్ధాన్ని ఆరంభిస్తున్న కొత్తలో పుతిన్ నమ్మారు. కానీ, అనేకశక్తుల రంగప్రవేశంతో యుద్ధం మరింత విస్తరిస్తూవచ్చింది, వెయ్యిరోజులకుపైగా ఎడతెగకుండా కొనసాగుతోంది. ఇంకా ఎంతకాలం సాగినా అంతిమంగా విజేతలంటూ ఎవరూ లేకపోయినా, అణ్వాయుధ వినియోగం ప్రమాదం కూడా పెరగవచ్చు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇచ్చిన హామీకి అనుగుణంగా అడుగులు పడితే సంతోషించాల్సిందే.

## హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు గారికి శుభాకాంక్షలు

– బొడ్డు బిక్షపతి గౌడ్.



ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

సిటీ స్మాల్ కాస్ కోర్టు చీఫ్ జడ్జి నుండి హైకోర్టు జడ్జి గా ప్రమోషన్ పొంది నేడు ప్రమాణస్వీకారం చేయబోతున్నా నందికొండ నర్సింగరావు గారిని కలిసి బొడ్డు బిక్షపతి గౌడ్ అధ్యక్షులు హయత్నగర్ కోర్టు మరియు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ రంగారెడ్డి గారు ప్రత్యేకంగా అభినందనలు తెల్పడం జరిగింది. వారు ఇదేవిధంగా కష్టపడుతూ సుప్రీం కోర్టు జడ్జి గా ప్రమోషన్ పొందాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో బొడ్డు బిక్షపతి గౌడ్, బత్తిని ఉపేందర్ మరియు తౌర్పునూరి ఈశ్వర్ గౌడ్ పాల్గొనడం జరిగింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మొమిన్ రోషన్ జమీర్



ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

మొమిన్ రోషన్ జమీర్, న్యాయవాది, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్, లీగల్ సెల్ (చట్టం, మానవ హక్కులు మరియు ఆర్టీఐ విభాగం), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, 2025 జనవరి 19న హైదరాబాద్‌లోని Upper pally , రాజేంద్రనగర్‌లో కనూన్స్ లా అండ్ టాక్సేషన్ ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొమిన్ రోషన్ జమీర్ గారు కనూన్స్ లా అండ్ టాక్సేషన్ ఆఫీస్ డైరెక్టర్లు, న్యాయవాది మహ్మద్ అఫ్జల్ పాషా మరియు మహ్మద్ అబ్దుల్ రహీమ్ గార్లను అభినందించారు. డైరెక్టర్లు మొమిన్ రోషన్ జమీర్ గారిని శాలువాతో, పుష్పగుచ్ఛాలతో మరియు భారత రాజ్యాంగ ప్రాంబుల్ ఫ్రేమ్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సయ్యద్ మన్సూర్, సయ్యద్ సైఫుల్లా, రజాక్ గార్లతో పాటు సయ్యద్ మొయిజుద్దీన్ ఘోరి పటేల్, ఒమర్ బాషా మరియు మరికొంత మంది న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కనూన్స్ లా అండ్ టాక్సేషన్ ఆఫీస్ డైరెక్టర్లను అభినందించారు.

## మోమిన్ రోషన్ జమీర్ కి ఘనంగా సన్మానం



ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

మోమిన్ రోషన్ జమీర్, న్యాయవాది, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు సోషల్ మీడియా, లీగల్ సెల్ (చట్టం, మానవ హక్కులు మరియు ఆర్టీఐ విభాగం) ఇన్‌చార్జ్, 2025 జనవరి 24న మస్జిద్-ఎ-ఖుతుబ్ షాహి, ఆలంగిరి, బోడుప్పల్, మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వద్ద, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ నియమిత మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ పాఠాన్, కమిటీ సభ్యులు మరియు ముసల్లీల చేతులమీదుగా ఘనంగా సన్మానించారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## గుండెపోటు రావడానికి మూడు గంటల ముందు కనిపించే లక్షణాలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

ఒకరికి హార్ట్ ఎటాక్ ఉందని అనుమానం ఉంటే, అతన్ని నడవడానికి అనుమతించకూడదుబీ మెట్లు ఎక్కడం లేదా దిగడం లాంటివి అనుమతించకూడదుబీ ఆటోలో ఆసుపత్రికి వెళ్లకూడదు. వీటిలో

ఏ ఒకటి జరిగినా రోగి మనుగడకు కష్టతరం అవుతుంది. గుండెపోటు (హార్ట్ ఎటాక్)ని మూడు గంటల ముందుగానే పసిగట్టగల అవయవం మన మెదడు. మన శరీర కార్యకలాపాల్లో చిన్నపాటి ఆటంకాలు ఏర్పడినా మెదడు వెంటనే అప్రమత్తం చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ జాగ్రత్తను అనుభవించడం కష్టం. ఏదయిన ఒక వివాహ వేడుకలో, బహిరంగ ప్రదేశాల్లో లేదా ఇంట్లో ఒక పురుషుడు లేదా స్త్రీ పొరపాటున పడిపోతున్నట్లు కనిపిస్తే, మనం వెంటనే వారిపై దృష్టి పెట్టాలి. కానీ తనకు ఏమీ జరగలేదు, నేను బాగున్నాను అని వారు చెప్పవచ్చు మనం కూడా ఏదో పైత్యం అని తేలిగ్గా వదిలేయకూడదు. మెదడు ప్రకటించే హెచ్చరికను చూడగానే వారి ఆరోగ్యం మనకు స్పష్టంగా తెలుస్తుకోవడానికి వారిని STR చేయమని చెప్పాలి..

STR అంటే:

(నవ్వమని చెప్పటం),

(మాట్లాడమని చెప్పటం)

( రెండు చేతులును పైకెత్తమని చెప్పటం)

ఇలాంటి కార్యక్రమాలు చేయమని చెప్పాలి. వారు ఈ మూడింటిని సరిగ్గా చేయాలి!ఇందులో ఏ ఒకట్టైన వారు సరిగ్గా చేయకపోయినా సమస్య పెద్దదే! వెంటనే ఆసుపత్రికి తరలించడం వల్ల మరణాన్ని నివారించవచ ఈ లక్షణం తెలిసి 3 గంటల్లోపు ఆసుపత్రికి వస్తే ప్రాణనష్టం చాలా వరకు అరికట్టవచ్చు అంటున్నారు వైద్యులు వారు ఈ మూడింటిని బాగా మరియు సరిగ్గా చేసినట్లయ్యే, మరింత ధృవీకరించకోవడానికి ఒక ముఖ్యమైన చర్య చేపట్టాలని ఇటీవలి వైద్య అధ్యయనం చెబుతోంది. తప్పక వారిని వారి నాలుకను బయటకు చాచమని అడగా వారు తన నాలుకను నిటారుగా చాచినట్లయితే, వారు సాధారణ మరియు ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించవచ్చు, వారు దానిని నేరుగా సాగదీయకపోతే అంటే ఒకే వ్మెపు కుడి లేదా ఎడమ వైపుకు వంగి ఉంటే తదుపరి 3 గంటలలోపు ఎప్పుడైనా, వారికి ఎటాక్ కలుగవచ్చు. వైద్యుల గణాంకాల ప్రకారం దీన్ని అందరికి చేరవేయడం ద్వారా 10శాతం మరణాలను నివారించవచ్చుననే వాదనలు వినిపిస్తున్నాయి.

## 26 నుండి రైతు భరోసా పథకాన్ని ప్రారంభం

ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

-ఈ పథకం కింద,ప్రతి అర్హుడైన రైతుకు సంవత్సరానికి ?12,000 పెట్టుబడి సాయం అందించబడుతుంది.

ముఖ్యమైన అంశాలు:

**1.రైతుబంధు లబ్ధిదారులు:**

ఇప్పటికే రైతుబంధు పథకం లబ్ధిదారులుగా ఉన్న రైతులు, ఈ పథకానికి కొత్తగా అప్లికేషన్ పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

**2.బ్యాంకు వివరాల మార్పు:**

రైతు తన బ్యాంకు వివరాలను మార్చుకోవాలనుకుంటే,తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలి.

**3.అర్హత:**

2025 జనవరి 1వ తేదీ వరకు కొత్త పట్టా పాస్ బుక్ ఉన్నవారు ఈ పథకానికి అర్హులు.




**4.నూతన అప్లికేషన్లు:**

అర్హులైన వారు,వారి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి అప్లికేషన్ ఇవ్వగలరు.

అప్లికేషన్ తో పాటు పొందపరచవలసిన పత్రాలు

-పట్టా పాస్ బుక్ ప్రతులు

-ఆధార్ కార్డు

-బ్యాంక్ ఖాతా వివరాలు

రైతు భరోసా పథకం పై మీకు ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే, సమీప వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయాన్ని సంప్రదించగలరు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## ఘనంగా ప్రపంచ బాలికల దినోత్సవం

### -దండుగేరి అంగన్వాడి కేంద్రంలో బాలికల దినోత్సవ వేడుకలు

వనపర్తి. ప్రజా స్వేచ్ఛ 24. ప్రతినిధి. వనపర్తి.

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దండుగేరి అంగన్వాడి కేంద్రంలో, జాతీయ బాలికల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ఉపాధ్యాయురాలు జి,పద్మ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జనవరి 24న ప్రపంచ జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని ఈ కార్యక్రమం మొక్కుబడిగా కాకుండా ఒక లక్ష సాధన కోసం బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, వివక్షత తో, పాటు



సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం, విద్య వైద్యం, సామాజిక, అంశాలతో పాటు బాలికల ఎదుగుదల పౌష్టికాహార లోపం బాల్యవివాహాలను అరికట్టడం తో పాటు అనేక విషయాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం చేయడానికి ఏకైక లక్ష్యమని ఆమె ఈ సందర్భంగా అన్నారు, అంగన్వాడి కేంద్రాలలో బాలికలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తూ బాలికల సంరక్షణను శ్రద్ధతో ఏకాగ్రతతో తీసుకోవడం జరుగుతుందని ఆమె సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని అభినందించి, సన్మానించడమే కాక వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అంగన్వాడి ఉపాధ్యాయురాలు జి.పద్మ తెలిపారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి సహాయకురాలు డి. సుజాత, అంగన్వాడి సెంటర్ కమిటీ సభ్యురాలు బి.పుష్ప, ఆయా తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

-గ్రామీణఉపాధి హామీ పనులలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

-ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్

-వలసలు నివారించాలని జిల్లా కలెక్టర్ కు బి కె ఎం యు వినతి

-జిల్లా లో వలసలు లేవు జిల్లా కలెక్టర్



**ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి కాకినాడ జనవరి 24**
రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసలు పోతున్నారని దీని వెంటనే నివారించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం కాకినాడలో ఉదయం స్థానిక జిల్లా కలెక్టర్కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, వలసలు నివారించే ప్రయత్నం చేయాలని,ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం 700 రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు జాబ్ కార్డు తో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధి హామీలో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలని మధు కోరారు పెండింగ్ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని ఉపాధి హామీల్లో రాజకీయ జోక్యాన్ని ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల ప్రమేయం నివారించాలని ఆయన అన్నారు ఇప్పటికే గ్రామాలు వదిలి వలస వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి పనులు కల్పించాలని చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి పరిస్థితులు ఈ ఏర్పడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు యువతి ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వ్యవసాయానికి సాగునీరు అందిస్తే ఉపాద అవకాశాలు పుష్కలంగా పెరిగితాయని వలసల నివారణకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు ఉపాధి హామీ చట్టంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కూటమి ప్రభుత్వంలో అధికారంలో వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తీసివేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేశవరపు అప్పలరాజు,పప్పు ఆదినారాయణ సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు,రాజు,వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-కుప్పిరెడ్డి వెంకట్రామి రెడ్డి మంగంపల్లి



**పెద్దమందడి. ప్రజా స్వేచ్ఛ 24. ప్రతినిధి. వనపర్తి.**
ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంగంపల్లి కుప్పిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంగంపల్లి గ్రామంలో మాట్లాడుతూ, ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను నూతనంగా ప్రవేశపెట్టేందుకు అర్హులను గుర్తించేందుకు, గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక, చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభల కు ప్రజలు స్వచ్ఛందంగా హాజరై దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ ద్వారా నిరంతరం పనిచేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లి అమలు అయ్యేలా బాధ్యత ప్రతి గ్రామం లో, ఇందిరమ్మ కమిటీల దే అని అయన అన్నారు. మా పేరు జాబితాలోని లేదు, అని ఒక్కరు కూడా బాధపడవద్దని, ఈ కార్యక్రమం ఏడాది పొడవున నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుందని, గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మరియు, కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్త లు, అందరు సమన్వయంతో, కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, ప్రతి గ్రామం లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా కృషి చెయ్యాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగంపల్లి కుప్పిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు.

## పారదర్శక పాలన కోసమే ప్రజా పాలన గ్రామసభలు




**ప్రజా స్వేచ్ఛ జనవరి 24 వలిగొండ ( ప్రతినిధి )**
మండల పరిధిలోని పహిల్వాన్ పురం.గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా పాలన గ్రామసభ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె నరేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీఓ కేదార్ ఈశ్వర్ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడారు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ పథకం,రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలను ఈనెల 26వ తేదీ నుంచి అందించడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజా పాలన,కుల గణన సర్వేలో భాగంగా సేకరించిన ఫిర్యాదులతో పాటు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హులైన వారి వివరాలను సేకరించి గ్రామసభలో తెలియజేయడం జరిగిందని అన్నారు.ఇంకా అర్హులైన వారు ఉండి జాబితాలో పేరు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే వారి దరఖాస్తులను కూడా పరిశీలించి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అర్హత ఉన్నప్పటికీ పథకంలో పేరు లేని వారు నిరాశ నిస్పృహలకు లోను కావద్దని అర్హులైన వారందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు ఇంటి స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ పథకంలో ఇల్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కరుణాకర్ రెడ్డి ఏఈఓ మహేష్ మాజీ ఎంపీటీసీ వనగంటి రమేష్ చీర్క శ్రీశైలం రెడ్డి జహంగీర్ లింగస్వామి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రమాదవశత్తు మత్స్యకారుడు మృతి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే టి.మేఘ రెడ్డి



**వనపర్తి. ప్రజా స్వేచ్ఛ 24. ప్రతినిధి. వనపర్తి.**
వనపర్తి పట్టణం 6వ వార్డుకు చెందిన, మత్స్యకారుడు వెంకటేష్ శుక్రవారం సమీపంలోని కుంటలోకి చేపల వేటకు వెళ్లి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా ఆసుపత్రి మార్చురీలో గల మృతుడు వెంకటేష్ మృతదేహం వద్ద నివాళు లర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా యువకుడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయ సహకరణ అందిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ కార్మికుడుకి గాయాలు




**ప్రజా స్వేచ్ఛ జనవరి 24 రామన్నపేట ప్రతినిధి**
విద్యుత్ లైను మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ప్రైవేటు విద్యుత్ కార్మికుడు గాయపడ్డాడు.ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది కనగల్ మండలం తొరగల్లు గ్రామానికి చెందిన మనోహర్ మండల కేంద్రంలో లూస్ లైన్ల కింద అదనపు స్తంభాలు వేసే క్రమంలో పని చేస్తూ స్తంభం పై నుండి జారి కింద పడ్డాడు అక్కడ ఉన్న వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం నల్గొండ లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా జూనియర్ కళాశాల మైదానం

-కలెక్టర్ సూచించిన పోలీసుల చర్యలు శూన్యం

**ప్రజా స్వేచ్ఛ జనవరి 24 సామర్లకోట ప్రతినిధి**
సామర్లకోట జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది.మందుబాబులు మందు తాగి ఖాళీ సీసాలు, ఆహార పదార్థాల వ్యర్థాలు పడేసి వెళ్తున్నారు.మందు సీసాలు పగిలి పోవడంతో ఉదయం,సాయంత్రం మైదానంలో వాకింగ్ వారికి మరియు మైదానంలో పలు క్రీడలు ఆడుకునే పలువురికి సీసాలు పెంకులు గుచ్చుకుని గాయాలు పాలవుతున్నారు.రాత్రి అయితే చాలు జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బైక్ లపై వచ్చి మద్యం తాగు తున్నారని పలువురు పేర్కొంటున్నారు.ఇటీవల జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ సైతం కళాశాల మైదానంలో జరుగుతున్న పలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని బహిరంగంగా పలువురికి వార్నింగ్ ఇచ్చిన,అసాంఘిక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, స్థానిక పోలీసులు క్రీడా మైదానంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాల పట్ల చర్యలు చేపట్టడం లేదని,పలువురు నుంచి విమర్శలు వస్తున్నాయి.ఇకనైనా జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ మరియు మందు,గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించే వారిపై పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుని వారి ఆగడాలను ఆరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఏపీలో మైనార్టీ విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్మెంట్ నిధుల విడుదల



**ప్రజా స్వేచ్ఛజనవరి 24 అమరావతి ప్రతినిధి**
ఏపీలో మైనార్టీ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల అయ్యాయి. రూ.40.22 కోట్ల ట్యూషన్ ఫీజు ప్రభుత్వం విడుదల చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ఒక ప్రకటనలో వెల్లడించారు.ముస్లిం మైనార్టీ స్టూడెంట్ కు రూ.37.88కోట్లు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ.2.34కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే టి పద్మారావు గౌడ్ పరామర్శించిన మారబోయిన రవి యాదవ్



**ప్రజా స్వేచ్ఛ జనవరి 24 శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)**
గ్రేటర్ హైద్రాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ ఉపాధ్యక్షుడు మారబోయిన రవి యాదవ్ మరియు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేశ్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, సాయి నందన్, శ్రీశైలం యాదవ్, స్వామి ముదిరాజ్ కలిసి, మాజీ మంత్రి మరియు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తలసాని పద్మారావు గౌడ్ ని మోండా మార్కెట్ వద్ద వారి నివాసంలో కలుసుకున్నారు. ఆయన దెహ్రాడూన్ పర్యటనలో అస్వస్థతకు గురైన తర్వాత కోలుకుంటున్న సందర్భంగా పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకుని, ఇంతకుమించిన ఉత్సాహంతో మాతో కలిసి ముందుకు రావాలని ఆకాంక్షిచారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే టి.మేఘరెడ్డి



**గోపాల్ పేట.ప్రజా స్వేచ్ఛ 24.ప్రతినిధి. వనపర్తి.**
గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్(ఈనాడు) జయన్న గారి కుమారుడు నిఖిల్ యాదవ్ రిసెప్షన్ వేడుకకు శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగుతూ కాసేపు సందడి చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## నయా యాక్టివా ధర రూ.80,950



దేశీయ మార్కెట్లోకి నయా యాక్టివా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది హెూండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన ఈ స్కూటర్‌లో సౌలభ్యంగా కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.80,950గా నిర్ణయించింది. బ్లూటూత్ కనెక్టివిటీతో 4.2 ఇంచుల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, నావిగేషన్, యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్ పోర్ట్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ ఆరు రంగుల్లో లభించనున్నది. 109.51 సీసీ ఇంజిన్‌తో తయారు చేసింది.

## జియో నూతన ప్రీపెయిడ్ ప్లాన్లు




టెలికం దిగ్గజం రిలయన్స్ జియో ప్రీపెయిడ్ యూజర్లకోసం కొత్తగా వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ సూచనల మేరకు డాటా అవసరంలేని కస్టమర్లకోసం తప్పనిసరిగా వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన ప్లాన్లను ప్రవేశపెట్టాలనే సూచనలకు అనుగుణంగా జియో ఈ నూతన ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 84 రోజుల కాలపరిమితితో రూ.458 ప్లాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌కింద అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, వెయ్యి ఎస్ఎంఎస్‌లు, రూ. 1,958 ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ వాయిస్‌కాల్స్‌తోపాటు 3,600 ఎస్ఎంఎస్‌లు 365 రోజుల ప్యాక్‌ను అందిస్తున్నది.

# మారుతి కార్ల ధరలకు రెక్కలు

**-రూ.32,500 వరకు పెంచిన ఆటోమొబైల్ దిగ్గజం**

కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ..నూతన వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అన్ని రకాల వాహన ధరలను రూ.32,500 వరకు పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.3.99 లక్షల ప్రారంభ ధర కలిగిన ఆల్టో కే-10తోపాటు రూ.28.92 లక్షల గరిష్ఠ ధర కలిగిన ఇన్విక్టో మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన ధరల పెంపు ఇలా..

కాంపాక్ట్ కార్ సెలేరియో రూ.32,500 వరకు పెరగనున్నది.

-ప్రీమియం మాడల్ ఇన్విక్టో రూ.30 వేల వరకు అధికంకానున్నది.




-మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యాగన్-ఆర్ మాడల్ రూ.15 వేల వరకు ప్రియంకానున్నది.

-స్విఫ్ట్ మాత్రం రూ.5 వేల వరకు పెరగనున్నది.

-ఎస్‌యూవీ మాడళ్లు బ్రెజ్జా రూ.20 వేలు, గ్రాండ్ విటారా రూ.25 వేలు ప్రియంకానున్నాయి.

-ఎంట్రీ లెవల్ స్మాల్ కారు ఆల్టో కే10 రూ.19,500, ఎస్-ప్రెస్ రూ.5 వేలు పెరగనున్నది.

-ప్రీమియం కాంపాక్ట్ మాడల్ బాలెనో రూ.9 వేల వరకు అధికమవనుండగా, కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ రూ.5,500, కాంపాక్ట్ సెడాన్ డిజైర్ రూ.10 వేల వరకు ప్రియంకానున్నాయి.

# చిక్కిపోతున్న ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు.. 1.88 బిలియన్ డాలర్లు డౌన్..

భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు మరింత తగ్గుముఖం పట్టాయి. ఈ నెల 17తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 1.88 బిలియన్ డాలర్ల పతనంతో 623.983 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు పతనమై 625.871 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ వెల్లడించింది. కొన్ని వారాలుగా నిరంతరం భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అవుతూనే ఉన్నాయి. అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనంతో బహిరంగ మార్కెట్‌లో మరింత పతనం



కాకుండా ఆర్బీఐ జోక్యం చేసుకుని డాలర్లు విక్రయిస్తోంది. ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ ఈ నెల 17తో ముగిసిన వారానికి 2.878 బిలియన్ డాలర్లు పతనమై 533.133 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గోల్డ్ రిజర్వ్ 1.063 మిలియన్ డాలర్లు పుంజుకుని 68.947 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్ఎస్) ఒక మిలియన్ డాలర్లు పెరిగి 17.782 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ నిల్వలు 74 మిలియన్ డాలర్లు పెరిగి 4.122 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి.

# నేడు ఇంగ్లండ్, టీమిండియా మధ్య రెండో టీ20

**-చెన్నై వేదికగా మరో ఆసక్తికర పోరు**
**-షమీని తుది జట్టులోకి తీసుకునే అవకాశం**

ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. చెన్నై వేదికగా శనివారం జరిగే రెండో టీ20లో ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20లో సమష్టిగా రాణించిన టీమిండియా 43 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టీ20ల్లో ఇంగ్లండ్‌పై టీమిండియాకు ఇదే అతిపెద్ద విజయం. ఇదే జోరులో చెన్నై వేదికగా జరిగే రెండో టీ20లోనూ విజయం సాధించాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి టీ20 ఓటమి తప్పిదాల నుంచి తేరుకొని విజయం సాధించాలని ఇంగ్లండ్ భావిస్తోంది. ఇంగ్లండ్ బ్యాటింగ్ వైఫల్యం కారణంగా తొలి టీ20 ఏకపక్షంగా సాగగా.. కనీసం రెండో టీ20 అయినా హెూరాహెూరీగా సాగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇక 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన మహమ్మద్ షమీకి తొలి టీ20 తుది




జట్టు దక్కలేదు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించడం కోసమే షమీని పక్కనపెట్టారు. అయితే చెన్నై వేదికగా జరిగే రెండో టీ20లో అతన్ని ఆడించే అవకాశాలు ఉన్నాయి. కొత్త బంతితో హార్దిక్ పాండ్యా విఫలమవడంతో షమీని ఆడించాల్సిన పరిస్థితి ఏర్పడింది.నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో చెన్నై లోకల్ భాయ్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే అవకాశాలు ఉన్నాయి. చెపాక్ మైదానం స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలోనే వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకోనున్నారు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. అంతేకాకుండా నెమ్మదిగా ఉంటుంది. అయితే ఐపీఎల్ 2024 సీజన్ ఆరంభంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. రేపటి మ్యాచ్‌లో కూడా పిచ్ బ్యాటర్లతో పాటు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే ఛాన్స్ ఉంది. తేమ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు. శనివారం చెన్నైలో వాతావరణం పొడిగా ఉండనుంది. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 29 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 23 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కానుంది.

**తుది జట్లు(అంచనా):**

భారత్: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(కీపర్), సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్: ఫిల్ సాల్ట్, బెన్ డకెట్, జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్ స్టోన్, జాకోబ్ బెతెల్, జామీ ఓవర్టన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

# స్పోర్ట్స్

## శతకంతో చెలరేగిన శార్దూల్ ఠాకూర్




ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2024-25లో టీమిండియా పేస్ ఆల్‌రౌండర్, ముంబై క్రికెటర్ శార్దూల్ ఠాకూర్ జోరు కొనసాగుతోంది. జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ శతకంతో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్‌లో 101 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును శార్దూల్ ఠాకూర్ మరోసారి ఆదుకున్నాడు. 105 బంతుల్లో 15 ఫోర్లతో సెంచరీ నమోదు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ శార్దూల్ ఠాకూర్ 51 పరుగులు చేసిన విషయం తెలిసిందే. శార్దూల్ సెంచరీతో ముంబై భారీ స్కోర్ దిశగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 7 వికెట్లకు 274 పరుగులు చేసింది. శార్దూల్ ఠాకూర్(119 బంతుల్లో 17 ఫోర్లతో 113) సెంచరీతో రాణించగా.. తనూష్ కోటియన్(119 బంతుల్లో 6 ఫోర్లతో 58 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరూ ఇప్పటికే 8వ వికెట్‌కు 173 పరుగులు అజేయంగా జోడించారు. యశస్వి జైస్వాల్(26), రోహిత్ శర్మ(28) రాణించారు. జమ్మూ కశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ(3/69) మూడు వికెట్లు తీయగా.. ఉమన్ నజీర్ మిర్(2/76), యుధ్‌వీర్ సింగ్(2/63) రెండేసి వికెట్లు తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే ఆలౌటైంది. శార్దూల్ ఠాకూర్(57 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51), తనూష్ కోటియన్(36 బంతుల్లో 5 ఫోర్లతో 26) మినహా అంతా విఫలమయ్యారు. రోహిత్ శర్మ(3), యశస్వి జైస్వాల్(4), అజింక్యా రహానే(12), శ్రేయస్ అయ్యర్(11), శివమ్ దూబే(0) దారుణంగా విఫలమైన వికెట్‌పై 8వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శార్దూల్ ఠాకూర్.. తనూష్ కోటియన్‌తో కలిసి 8వ వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. జమ్మూ కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 41.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్లలో మోహిత్ అవస్థి(5/52) ఐదు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్(2/39), శామ్స్ ములానీ(2/61) రెండేసి వికెట్లు పడగొట్టారు. శివమ్ దూబేకి ఓ వికెట్ దక్కింది. 86 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై..శార్దూల్ ఠాకూర్‌తో రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ఇప్పటికే ముంబై ఆధిక్యం 188 పరుగులకు చేరింది.

# ఢిల్లీపై సౌరాష్ట్ర ఘన విజయం!

**12 వికెట్లతో రాణించిన జడేజా**

ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రఫ్ఫాడించాడు. బీసీసీఐ నయా రూల్‌తో దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన జడేజా సౌరాష్ట్ర తరఫున అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఢిల్లీతో గురువారం ప్రారంభమైన మ్యాచ్‌లో రవీంద్ర జడేజా 12 వికెట్లు పడగొట్టి సౌరాష్ట్రకు ఘన విజయాన్ని అందించాడు. జడేజా ధాటికి ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో (5/66) ఐదు వికెట్లు పడగొట్టిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో(7/38) ఏడు వికెట్లు తీసాడు. బ్యాటింగ్‌లో 38 పరుగులు చేసి కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జట్టు



విజయంలో కీలక పాత్ర పోషించిన జడేజాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో రీఎంట్రీ ఇచ్చిన మిగతా ఇంటర్నేషనల్ స్టార్స్ అంతా విఫలమవ్వగా.. జడేజా ఒక్కడే అసాధారణ ప్రదర్శన కనబర్చడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున రిషభ్ పంత్ బరిలోకి దిగగా.. రెండు ఇన్నింగ్స్‌ల్లో అతను విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ధర్మేంద్ర జడేజా బౌలింగ్‌లోనే ఔటవ్వగా.. రెండో ఇన్నింగ్స్‌లో రవీంద్ర జడేజాకు వికెట్ సమర్పించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఒక్క పరుగే చేసిన పంత్.. రెండో ఇన్నింగ్స్‌లో 17 పరుగులకే వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 49.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఆయుష్ బదోని(60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. హర్విక్ దేశాయ్(93), అర్పిత్ వసవడ(62) రాణించారు. 83 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ 25.2 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది. దాంతో సౌరాష్ట్ర ముందు 12 పరుగుల లక్ష్యమే నమోదవ్వగా.. సౌరాష్ట్రా 15 పరుగులు చేసి భారీ విజయాన్నందుకుంది.




# కాంచన 4లో ఆ ఇద్దరు హీరోయిన్లకు ఛాన్స్

హార్రర్ కామెడీ జోనర్ సినిమాలకు దక్షిణాదితోపాటు ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్న ఫ్రాంఛైజీ కాంచన. టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాఘవా లారెన్స్ కాంపౌండ్ నుంచి ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు పార్టులు రాగా.. ఇప్పుడిక కాంచన 4 టైం కూడా వచ్చేసింది. ఈ చిత్రంలో పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయని తెలిసిందే. అంతేకాదు బీటౌన్ డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుందని మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ విషయాన్ని నిర్మాత మనీశ్ షా ప్రకటించాడు. ఈ చిత్రాన్ని గోల్డ్ మైన్ ఫిలిమ్స్ తెరకెక్కించనుంది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులను ఫైనల్ చేయాల్సి ఉందని ఇప్పటికే ఓ చిట్‌చాట్‌లో చెప్పాడు మనీశ్ షా. కాంచన 4 జనవరి లేదా ఫిబ్రవరి 2025లో సెట్స్‌పైకి వెళ్లనుందని.. హిందీ, తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో తెరకెక్కించబోతున్నామని చెప్పారు. ఈ మూవీ రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. కాంచన 4 గురువారం ప్రారంభమైంది. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత డిజిటల్ విడుదల అవుతుందని మనీష్ షా స్పష్టం చేశారు. హిందీ వెర్షన్ కూడా జాతీయ స్థాయిలో విడుదలవుతుందన్నారు మనీశ్ షా. కాంచన సిరీస్‌కు హిందీలో కూడా మంచి క్రేజ్ ఉంది.

# ప్రతిదాన్ని చివరిగా భావించే దశలో ఉన్నా




తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు మళ్లీ చాలా కాలం తర్వాత బిజీగా మారిపోయారు. వరుస ఈవెంట్స్‌లో పాల్గొంటూ అభిమానులను అలరిస్తున్నారు. అయితే, జీవితంలో ప్రతి దాన్ని చివరిదిగా భావించే దశలో తాను ఉన్నానని సామ్ తాజాగా తెలిపారు. ఈ మేరకు ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. సాధారణంగా ఉండే సినిమాలను ఎన్నో అంగీకరించొచ్చన్నారు. తాను మాత్రం కచ్చితంగా ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపే వాటినే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. వంద శాతం నమ్మితేనే ఆ పాత్రలను చేస్తానని, లేకపోతే చేయలేనని తెలిపారు. సవాలుగా అనిపించే పాత్రలనే ఎంపిక చేసుకుంటున్నట్లు వెల్లడించారు. రాజ్ అండ్ డీకే ఎక్కువగా సవాలుగా అనిపించే పాత్రలనే రూపొందిస్తున్నారని.. వారితో వర్క్ చేయడం తనకు ఎంతో సంతృప్తిగా ఉంటుందని సామ్ చెప్పుకొచ్చారు. గొప్ప సినిమాలో నటించాననే ఫీల్ రాకపోతే వర్క్ చేయలేనని సామ్ వివరించారు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. ప్రస్తుతం తన కొత్త వెబ్ సిరీస్ Rakt Brahmand వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది.

# ఏదీ రాసుకుంటారో రాసుకోండి

బాలీవుడ్ నటి, సైఫ్ అలీ ఖాన్ కూతురు సారా అలీ ఖాన్ ఎప్పుడు హాట్ టాపిక్ గా నిలుస్తుంటుంది. ఆమె నటన పరంగా పర్వాలేదు. సోషల్ లైఫ్ లో మాత్రం అల్వేస్ ట్రెండింగ్. ఆమె జెన్ జీ నటి. ఆమె బిహేవియర్ కూడా అలాగే ఉంటుంది. పార్టీస్, ఫ్రెండ్స్, ట్రిప్స్, యాక్సెంట్ అని డిఫరెంటే. అయితే ఆమె ట్రిప్స్ కు రెగ్యులర్ వెళ్లే విషయం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె డేటింగ్ లైఫ్ పై అనేక వార్తలు ప్రచారం అవుతుంటాయి.

మరి తాజాగా ఓ ఆసక్తికర ఘటన జరిగింది. అదేంటంటే..సారా అలీ ఖాన్ ఎంత పెద్ద మహాశివుడి భక్తురాలో ఆమె ఫాలోయర్స్ కి బాగా తెలుసు. ఆమె తరుచుగా కేదార్నాథ్ ఆలయాన్ని సందర్శించే విషయం తెలిసిందే. ఇటీవలే ఏపీలోని శ్రీశైల మల్లిఖార్జున స్వామిని కూడా దర్శించుకున్నారు. ఇదంతా పక్కనా పెడితే.. ఆమె యాక్టర్ అరుణ్ బజ్వా ప్రతాప్ తో కేదార్నాథ్ వెళ్లిన ఫోటోలు ఇంటర్నెట్ లో సంచలనం సృష్టించాయి. వీళ్లిద్దరు స్నేహితులు మాత్రమే కాదు డేటింగ్ లో ఉన్నారని గుసగుసలు వినిపించాయి. ఇది ఇలా ఉండగానే రాజస్థాన్ లో వీరిద్దరూ ఒకే ప్రదేశంలోని ఫోటోలని వేరువేరుగా షేర్ చేశారు. దీంతో ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. ఈ నేపథ్యంలోనే అర్జున్ బజ్వా మరింతా ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం వైరల్ గా మారింది. ఆయన ఏమన్నారంటే. రీసెంట్ గా బజ్వా, సారాల రిలేషన్షిప్ గురించి అనేక వార్తలు ప్రచారం అవుతున్నాయి. దీనిపై బజ్వా స్పందిస్తూ.."ఎవరు ఏది రాయాలి అనుకుంటే అది రాస్తారు. అది వారి డ్యూటీ. ఎవరు చేయాల్సిన పనిపై వారు దృష్టి సారించడం మంచిదే. నేను కూడా నేను చేయాల్సిన పనిపై దృష్టి సారిస్తున్న" అన్నారు. దీంతో కొందరు ఆ జంటకు ప్రైవసీ ఇవ్వాలని అభిప్రాయాలూ వ్యక్తం చేస్తుంటే. మరికొందరు ఆయన వార్తలను ఖండించలేదు కాబట్టి.. వాళ్లిదరు డేటింగ్ లో ఉన్నా వార్తలు నిజమే అంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.






# షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ది ఫ్యామిలీ మ్యాన్-3

ఓటీటీ ప్రియులకు పరిచయం అక్కర్లేని వెబ్ సిరీస్‌లలో 'ది ఫ్యామిలీ మ్యాన్' ఒకటి. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి లీడ్ రోల్‌లో నటించిన ఈ సిరీస్ రెండు భాగాలుగా వచ్చి అమెజాన్ ప్రైమ్‌లో రికార్డులు నమోదు చేసింది. స్పై, థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సిరీస్‌ను దర్శకద్వయం రాజ్ డీకే తెరకెక్కించారు. ఈ వెబ్ సిరీస్ షూటింగ్ గత ఏడాది మేలో ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ షూటింగ్ కంప్లీట్ చేసుకున్నట్లు రాజ్ డీకే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ మ్యాన్ టీమ్‌తో దిగిన ఫొటోలను పంచుకున్నారు. ఈ ఫొటోలలో సమంత కూడా ఉండడం విశేషం. ఫస్ట్ సీజన్ టెర్రరిజం బ్యాక్‌డ్రాప్‌లో రాగా.. సెకండ్ సీజన్ శ్రీలంక రెబల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి హిట్ అందుకుంది. ఇక సెకండ్ సీజన్‌లో సమంత లీడ్ రోల్‌లో నటించడం విశేషం. అయితే 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' ఎక్కడైతే పూర్తైందో అక్కడి నుంచే 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' మొదలవుతుందని మేకర్స్ తెలిపారు. సీజన్ 3 ఎక్కువగా నార్త్ ఈస్ట్ ఇండియాలో బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్లు ప్రకటించింది. శ్రీకాంత్ తివారీ (మనోజ్ బాజ్‌పాయ్) పిల్లలు పెద్దవాళ్లు అవుతారు. ఆయనకు వయసు పెరిగినా సవాళ్లు వెంటాడుతూనే ఉంటాయి. అయితే ఈ సవాళ్లను శ్రీకాంత్ ఎలా ఎదుర్కొన్నాడనేది తెలియాలంటే సీజన్ 3 వచ్చేవరకు ఆగాల్సిందే.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492